క్లుప్తంగా

అనాథ యువతి పెళ్లికి ఆర్థిక సాయం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అనాథ యువతి పెళ్లికి పిట్లం లయన్స్ క్లబ్ సభ్యుడు రాజు రూ.20 వేల నగదు సాయం చేసి ఉదారతను చాటుకున్నారు. గౌరారం గ్రామానికి చెందిన యువతి రాజేశ్వరి తల్లిదండ్రుల మృతితో ఆమె అనాథగా మారింది. వచ్చే నెల 6న ఆమె పెళ్లి ఉండటంతో పెళ్లి ఖర్చులకు సాయం కోరగా.. లయన్స్ క్లబ్ సభ్యుడు రాజు రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు సంజీవ్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మోతె శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అలాగే నర్సరీ, కంపోస్టు షెడ్డు, స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఉపాధి పనులు కొలతల ప్రకారం చేపట్టాలని సూచించారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు..



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, జర్నలిస్టు కాలనీ మీదుగా వేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం పంచాయతీరాజ్ డీఈఈ ప్రభాకర్ పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద వచ్చిన రూ. 20 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు వేస్తున్నామని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్లు వేయిస్తున్నామని డీఈఈ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఏఈ మొగులయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు అనీస్ పటేల్, రాము రాథోడ్, జి.రమేష్, జమీల్ తదితరులు ఉన్నారు.

నియామకం



భిక్కనూరు: బీసీ రాజ్యాధికార సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన దేవర లక్ష్మిని వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ నియమించారు. ఈమేరకు శుక్రవారం బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాస రాజేశ్వర్ నియామక పత్రాన్ని అందజేశారు. మహిళ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

అచ్చంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కృష్ణ



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంగలి కృష్ణను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, బలరాం, బంగ్లా ప్రవీణ్, రామురాథోడ్, అంజయ్య, రవీందర్ తదితరులున్నారు.

సైన్స్ ఉపాధ్యాయుడికి ప్రశంసా పత్రం



భిక్కనూరు: హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ దినోత్సవంలో భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు తమ్మలి రాజును వరంగల్(ఎన్ఐటీ) ప్రొఫెసర్ సతీష్ అభినందించి ప్రశంసా పత్రం అందించారు. కార్యక్రమంలో తమ్మలి రాజు.. విజ్ఞాన శాస్త్రంలో విద్యార్థుల ప్రమాణాలు పెంచడానికి ఆచరించాల్సిన వినూత్న పద్ధతులపై రూపొందించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. తమ్మలి రాజును మండల నోడల్ అధికారి శ్రీనాథ్‌తో పాటు ఎంఈవో రాజుగంగారెడ్డిలు అభినందించారు.


దాహం తీర్చని అమృత్ పథకం



బాన్సువాడలో అమృత్ పథకానికి ఎంపిక చేసిన స్థలం (ఫైల్)

- శంకుస్థాపనకే పరిమితమైన పథకం
- శిథిలావస్థలో ట్యాంకులు
- ముందస్తు చర్యలు చేపట్టకుంటే వేసవిలో తప్పని నీటి తిప్పలు

బాన్సువాడ : అమృత్ పథకం పనులు ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. శంకుస్థాపనకే పనులు పరిమితమయ్యాయి. బల్దియా పరిధిలో ఉన్న పాత రక్షిత మంచినీటి ట్యాంకు పైపుల్లో పూడిక నిండిపోవడంతో తాగునీరు అంతంతా మాత్రంగానే సరఫరా అవుతున్నాయి. బల్దియాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని అమలు చేసింది. అందులో భాగంగా అమృత్ పథకం కింద బాన్సువాడ బల్దియాకు రూ.52 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులకు జనవరి 7న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. పనులు పూర్తయితే మరో 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉంటుంది. కానీ పనులు ఒక్క అడుగు కూడా వేయడం లేదు. బాన్సువాడ బల్దియాలో కొయ్యగుట్ట, తాడ్కోల్‌లో సగభాగం, బీసీ కాలనీ, కొయ్యగుట్ట తండా విలీనమయ్యాయి. అమృత్ 2.0 పథకంతో మంజూరైన రూ.52 కోట్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలు, పట్టణంలోని కొత్త కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయనే గంపెడాశతో ఉన్న కొత్త కాలనీలవాసులకు ఈ వేసవి కాలం గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. బాన్సువాడ మండలం చింతల్‌నాగారం శివారులోని మంజీర ప్రాంతంలో అమృత్ పథకాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు స్థలాన్ని ఎంపిక చేశారు. అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా పట్టణానికి, కొత్త కాలనీలకు, విలీన గ్రామాలకు తాగునీటి సరఫరా చేయనున్నారు. ఫిల్టర్ బెడ్ నుంచి మంజీర ప్రాంతానికి సీసీ రోడ్డు కూడా నిర్మించనున్నారు. అమృత్ పథకం ద్వారా తాగునీటి సమస్య, సీసీ రోడ్డు ద్వారా ఆయా ప్రాంతాల రైతుల సమస్యలు తీరనున్నాయి. బాన్సువాడ బల్దియా పరిధిలో సుమారు 50 వేల పైనే జనాభా ఉండగా 9,200 గృహాలు, 21 వాటర్ ట్యాంకులున్నాయి. గతంలో 100 కిలోమీటర్ల మేర పైపులైను ఏర్పాటు చేశారు. అమృత్ 2.0 పథకం ద్వారా 18 లక్షల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంకుకు అనుసంధానంగా 7 లక్షల సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు, మరో 5 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న 4 వాటర్ ట్యాంకులను నిర్మించనున్నారు. ట్యాంకులు, పైపులైన్ల పనులు ప్రారంభించకపోవడంతో పట్టణ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు.



బాన్సువాడలో శిథిలావస్థకు చేరిన ట్యాంకు

అమృత్ నిధులతో మున్సిపాలిటీలో చేపట్టే పనులు

- 18 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకు ఒకటి.
- 7 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకు
- 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల నాలుగు ట్యాంకులను నిర్మించనున్నారు.
- ఇంటింటికి నీటిని సరఫరా చేసేందుకు 80 నుంచి 100 కిలోమీటర్ల పైపు లైను వేయనున్నారు.
- 6 వేల పైగా నల్లా కనెక్షన్‌లు ఇవ్వనున్నారు. ఈ మేరకు త్వరలో పనులు కూడా చేయనున్నారు.

భగీరథ నీరు రావడం లేదు



ప్రతి రోజూ నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. మా కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. పైపులు వేయలేదు. కుళాయిలు బిగించలేదు. వేసవి దృష్ట్యా బోరులో నీళ్లు రావడం లేదు. ఉన్న కుళాయికి నీళ్లు సరిగ్గా రావడం లేదు. రోజూ మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడే ఇలా ఉంటే ఎండాకాలంలో ఎలా ఉంటుందో..

–శ్రీనివాస్, బాన్సువాడ

సమస్య లేకుండా చూడండి



రోజూ నల్లాలు రావడం లేదు. ట్యాంకులు నిండడం లేదని చెబుతున్నారు. కొత్త ట్యాంకులు నిర్మిస్తామని చెబుతున్నారు. అవి ఎప్పుడు అవుతాయో తెలియడం లేదు. ఎండాకాలంలో మంచినీటి సమస్య లేకుండా చూడండి. మాకు మిషన్ భగీరథ నీరు ఇప్పటి వరకు రాలేవు.

– గణేశ్, బాన్సువాడ

పనులు ప్రారంభించేలా చూస్తాం

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 పథకం పనులు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. బల్దియా పరిధిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. పాత ట్యాంకుల్లో పూడికను తొలగిస్తాం.

–శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



బిచ్కుందలో లక్ష చెక్కు అందిస్తున్న మఠాధిపతి, ఎమ్మెల్యే దంపతులు, మాజీ ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ్ మఠంలో మూడు రోజులుగా మహా శివరాత్రి సందర్భంగా కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులకు మఠం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతిగా రూ.లక్ష నగదు, రెండో బహుమతిగా రూ.50 వేల నగదును అందించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు దంపతులు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, మల్లికార్జున్ అప్పా షెట్కార్, తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ, కరాటేలో సత్తా చాటిన విద్యార్థినులు



సర్టిఫికెట్లతో విద్యార్థినులు

పిట్లం(జుక్కల్): సంగారెడ్డిలో ఫిబ్రవరి 26న వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ ఓపెన్ నేషనల్ కుంగ్‌ఫూ కరాటే పోటీలలో పిట్లం మండలం రాంపూర్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. గాయత్రి, శిల్ప, సంగీత, భార్గవి, రమ్య, నందినిలు 3 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించారు. విద్యార్థినులకు శుక్రవారం సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయులు శ్రీలత అందజేశారు. ఉపాధ్యాయులు విట్టల్, సాయిబాబు, సయ్యద్ నబీ, బుజ్జయ్య, స్వరూప, రాజు, శివనాగేశ్వరరావు, నీలిమ, పీటీ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



భిక్కనూరు: కల్లు దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు అన్నారు. శుక్రవారం భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో 18 గ్రామాలకు చెందిన కల్లు డిపో యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కచ్చితంగా సమయపాలన పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సూచించారు. కల్లు దుకాణాలతో పాటు రోడ్డుపైన కూడా సీసీ కెమెరాలను తప్పనిసరిగా పది రోజుల్లో ఏర్పాటు చేయాలన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు అరికట్టొచ్చు



పిట్లం(జుక్కల్): గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని ఎస్సై రాజు పేర్కొన్నారు. మద్దెల చెరువు గ్రామ ప్రధాన కూడళ్లలో గ్రామస్తుల సహకారంతో 8 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను శుక్రవారం ఎస్సై రాజు ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాలలో స్థానికులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని ఆయన సూచించారు.

ఆధ్యాత్మికం

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో హనుమాన్ ఆలయ 9వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయంలో భజన, కీర్తన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బోనాల పండుగ



ఎల్లారెడ్డిరూరల్: తిమ్మాపూర్‌లో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రామంలోని నల్లపోచమ్మ, ముత్యాల పోచమ్మలకు భక్తులు బోనాలను సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. గ్రామ పెద్దలు రవీందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సంతోషిమాత ఆలయానికి పూజా సామగ్రి అందజేత

భిక్కనూరు: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయానికి అవసరమైన ఇత్తడి పూజా సామగ్రిని రిటైర్డు హెచ్ఎం గౌరిశెట్టి రమేశ్ గుప్తా శుక్రవారం అందజేశారు. గతంలో కూడా ఆయన అమ్మవారి ఆలయానికి అవసరమైన వస్తువులను పలుమార్లు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పురాం రాజమౌళి, ప్రతినిధ/ చీకోటి నాగభూషణం, రిటైర్డు ట్రాన్స్‌కో ఏఈ పున్న లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సన్మార్గంలో నడవాలి



ఎల్లారెడ్డి: భక్తులు సన్మార్గంలో నడవాలని తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామి సరస్వతి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలో స్వామి వారి పాదుకార్చన కార్యక్రమం నిర్వహించారు. ప్రణయ్‌కుమార్, శేఖర్ శర్మ తదితరులున్నారు.

ప్రారంభమైన శ్రీరమా సత్యనారాయణ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కామారెడ్డి అర్బన్: స్థానిక సిరిసిల్లరోడ్డులోని గాంధీ నగర్‌లో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి, పరివాహన దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు వీరమల్లి శ్రీనివాస్, సంతోష్, మాజీ కౌన్సిలర్ అంజల్‌రెడ్డి, వేణు, సురేందర్, మహేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



మహమ్మద్‌నగర్ జెడ్పీ హైస్కూల్లో సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్ : ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్' సిద్ధాంతాన్ని కనుగొన్న రోజును పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు చోట్ల సైన్స్ ఫెయిర్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.. ఆలోచింపజేశాయి. పలువురు మండల విద్యాధికారులు సందర్శించి విద్యార్థులను అభినందించారు.



బీబీపేట బాలికల ఉన్నత పాఠశాలలో ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈవో అశోక్



జంగంపల్లి ఉన్నత పాఠశాలలో ..



తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో ..



మద్నూర్ గురుకుల పాఠశాలలో..



బోర్లం జెడ్పీహైస్కూల్‌లో రామన్ అక్షరమాల క్రమంలో కూర్చున్న విద్యార్థులు



మాచారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో కామారెడ్డి ఉపాధ్యాయులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పి.ప్రవీణ్ కుమార్, భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తమ్మల రాజులు రూపొందించిన సైన్స్ సెమినార్ పేపర్స్ రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర విద్యా పరిశోధన మండలి హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ప్రదర్శించారు. విజ్ఞాన శాస్త్రాన్ని విద్యార్థి స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి జ్ఞాన తీరాలకు తీర్చేది సైన్స్ అని వారు పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, పాఠ్యాంశాలను నిత్యజీవితానికి అనువర్తనం చేసే విధంగా ప్రమాణాలు పెంచాలన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులను జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, జిల్లా విద్యాధికారి రాజు అభినందించారు .



ప్రదర్శన ఇస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్

సంక్షిప్తం

ఐకేపీ కార్యాలయంలో ఆడిటింగ్



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం ఆడిటింగ్ నిర్వహించారు. మండలంలోని 20 గ్రామ సంఘాలకు సంబంధించిన వివరాలను ఆడిటింగ్ చేశారు. ఏపీఎం ప్రసన్నరాణి, ఆడిటింగ్ అధికారులు సంఘమేశ్వర్, కుమార్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదు




ఎల్లారెడ్డిరూరల్: అడివిలింగాలలో భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులు సంఘంలో సభ్యత్వం పొందడం ద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చని నాయకులు సాయిబాబా అన్నారు.సాయిలు, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

కామారెడ్డి అర్బన్: స్థానిక ఆర్‌బీనగర్ ఇష్టకార్య సిద్ధి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి మాందాపూర్‌కు చెందిన గజేల్లి విజయ్–రష్మిత, శ్రీనివాస్–అనూషలు రూ.30 వేలు విరాళం అందజేశారు. ఈ విరాళంతో ఆలయంలో సీసీ కెమెరాలు బిగించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు అయిత బాల్‌కిషన్, శ్రీగాథ చారి, సంతోష్‌లు తెలిపారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చికిత్స నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వైద్య సిబ్బంది చంద్రకళ, రాజమణి, వెంకట్, లక్ష్మణ్, అంజలి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రాజంపేట పీహెచ్‌సీలో ..

రాజంపేట: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం మహిళలకు అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయ మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. గర్భిణీలు ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. డాక్టర్ సంగీత, సూపర్వైజర్లు మంజూర్, గంగామణి, వైద్యారోగ్య సిబ్బంది చంద్రకళ, జ్యోతి, యాదమ్మ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ కమల్ కిశోర్ మాట్లాడుతూ.. వైద్యురాలు సారిక 8 మంది దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అలాగే దివ్యాంగులకు ఇంటి వద్ద చేయించే వ్యాయామాల గురించి ఆమె విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం

పిట్లం(జుక్కల్): గౌరారం తండాలో శుక్రవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ..పశువులకు చికిత్స చేసి మందులు అందించామన్నారు. పశుగణ అభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ మాజీద్ హైమద్, సూపర్వైజర్ తిరుపతి, గోపాల మిత్రలు శ్రావణ్, రాములు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మాచారెడ్డి: మండల డీజే యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా జి.గణేశ్, కోశాధికారిగా సాయి, సలహాదారులుగా శ్రావణ్, నగేష్, సత్యనారాయణ, రవితేజ ఎన్నికయ్యారు.